మోడర్న్‌గా బతికే ఆమె సనాతనుడయిన వరుడిని ఎందుకు కోరుకుంది?

# కప్పగంతుల మల్లిఖార్జున రావు కథ

# ఎంటర్ ది ట్వంటీ ఫస్ట్ సెంచరీ

విశ్వపతి సంధ్యావందనం ముగించబోతుండగా హైటోన్‌లో పాశ్చాత్యసంగీతం గుండెలదరగొట్టేలా విన్పించింది.

సుపుత్రుడుగారి సుప్రభాతమన్నమాట!

విశ్వపతికి చిరాకొచ్చింది.

ఆరోజు అంతా తెల్లవారగముందే నిద్ర లేవాలి. కాలకృత్యాలు తీర్చుకోవాలి. ఇంటిని ప్రశాంతంగా ఉంచాలి. ఎటువెళ్ళినా మధ్యాహ్నానికల్లా అంతా ఇల్లు చేరుకోవాలి. కల్సి భుజించాలి.

అలాగని రాత్రే అందరికీ చెప్పేడు అతను.

అయినా తన మాటను లెక్కచెయ్యలేదు వాడు.

కోపం వచ్చింది. నేరుగా కొడుకు గది దగ్గరికెళ్ళాడు.

సంగీతానికి అనుగుణంగా తలను, శరీరాన్ని ఊపుతున్నాడు గోపీ. పాములా వంకర్లు తిరిగిపోతున్నాడు.

'గోపీ. ఆపు ఆ పాపిష్టి మ్యూజిక్. ఈ రోజు ఇలాంటి వేషాలు పనికిరాదన్నానా?'

గోపీ మ్యూజిక్ టోన్‌ను తగ్గించాడు.

'సారీ డాడ్. బట్ దిస్ ఈజ్ మై మార్నింగ్ ఎక్సర్‌సైజ్. దిస్ క్లియర్స్ మై డైజెస్టిక్ సిస్టమ్. వాట్ కెన్ ఐ డూ?'

'ఈ న్యూసెన్స్‌కన్నా హాయిగా రెండు మైళ్ళు నడిచిరారాదూ?'

'దటీజ్ ఓల్డ్ మెథడ్ డాడ్. అయామ్ ఎ ట్వంటీ ఫస్ట్ సెంచరీ మేన్. తద్దినాలు గిద్దినాలు లాంటి మీ ఛాదస్తాలు నాకు గిట్టవు. ఐ విల్ నాట్ రెస్పెక్ట్ దెమ్.'



పుట్టేపుట్టగానే పిల్లలిద్దర్నీ కాన్వెంట్‌లో పడేసేడు విశ్వపతి.

చదువు అబ్బకపోయినా ఇలాంటి ఎంగిలి కూతలు చాలా వచ్చేయి. సంస్కారం పెరగలేదు. భ్రష్టాచారాలు పట్టుబడ్డాయి.

'నీ లైకింగ్, నీ రెస్పెక్ట్ ఎవరిక్కావాలి రా ఫూల్. నువ్వెంత నీ బ్రతుకెంత? నేను చెప్పినట్టు చెయ్యి. లేకపోతే తోలు వలిచేస్తాను.

దట్స్నాల్' అని శాసించగల సామర్థ్యం లేదు విశ్వపతికి. అలా అన్నా వాళ్ళ తల్లి ఊరుకోదు. పిల్లల్ని వెనుకేసుకొనివస్తుంది.

'తద్దినాలు పెట్టేది నాకోసం కాదురా. చనిపోయిన మా నాన్నకోసం. కొడుకుగా ఆయన తద్దినాన్ని నిష్టగా పెట్టాలన్నది ఆయన అభిమతం. నువ్వు నాకు తద్దినం పెడ్తావన్న నమ్మకం నాకెలాగూ లేదు. నేను బతికున్నంతకాలం మా నాన్న తద్దినాన్ని పెట్టుకోనియ్ నన్ను.'

'ఆల్‌రైట్ ఫాదర్. యాజ్‌యు విష్' అంటూ టేప్‌రికార్డర్ కట్టేసి బాత్‌రూమ్‌లోకి దూరేడు గోపి.

'అమ్మాయ్ సుకన్యా' అంటూ కూతురు గదివైపు వెళ్ళబోతుండగా ఫోన్ మోగింది.

'హలో. విశ్వపతి హియర్.'

'అయ్యా. నేను సూర్యనారాయణ సిద్ధాంతిని—'

సూర్యనారాయణ సిద్ధాంతి విశ్వపతి గారింటి పురోహితుడు. చాలా గొప్ప వేదపండితుడు.

'ఏమిటండీ పొద్దున్నే ఫోను చేసేరు. పెందరాడే వస్తున్నారుగా?'

'మా తమ్ముడి కోడలు ప్రసవించింది సార్. పురుడొచ్చింది—'

'అలాగా! మరిప్పుడెలాగా?'

రాత్రినుంచి తద్దినానికి అన్నీ అవరోధాలే కన్పిస్తున్నాయి.

సుకన్యను చూసుకోటానికి ఈరోజు సాయంకాలానికొస్తున్నామని ఎవరో చెప్పేరు. మర్నాడు పెట్టుకోండంటే వీల్లేదన్నారు. ఆ అబ్బాయికి మర్నాడు ఢిల్లీలో ఏదో ప్రోగ్రాం ఉందిట.

'అయ్యా విశ్వపతిగారూ. మీరేం కంగారుపడనక్కర్లేదు. నా స్థానంలో మరో బ్రాహ్మణుడిని మంత్రం చెప్పడానికి పంపిస్తాను. ఇద్దరు భోక్తలు ఎలాగూ వస్తారు కదా?'

విశ్వపతి తండ్రి ఆ రోజుల్లో డిప్టీ కలెక్టర్ ఉద్యోగం చేసేడు. అయినా ఆయనకు వేదాలలో పాండిత్యం ఉండేది. మంచి కర్మిష్టి. నిత్యం సంధ్యావందనం, దేవతార్చన చేసేవారు.

ఆయన చిన్నతనంలోనే విశ్వపతికి ఉపనయనం చేయించి కొన్ని మంత్రాలు నేర్పించాడు. అయిష్టంగా నేర్చుకొన్నా కొన్ని మంత్రాలు నోటబట్టాయి.

మంత్రానికి స్వరం ప్రధానం. స్వరయుక్తంగా తద్దినం మంత్రం చెప్పగలవారు సిద్ధాంతిగారు కాక ఇంకా ఎవరైనా ఉన్నారంటే విశ్వపతి విశ్వసించడు.

'అయ్యా. ఈసారికి మీరు నన్ను మన్నించాలి. తద్దినంరోజు మీ నియమనిష్టలు, మంత్రంపట్ల శ్రద్ధ తెల్సినవాడిని నేను. మంచి బ్రాహ్మణుడినే కుదిర్చాను. ఈసారికి కొంచెం సర్దుకోండి.'

సర్దుకోక చేయగలగిందేముంది కనుక!

'డాడీ. చూడు డాడీ. మమ్మీ నా నిద్ర డిస్టర్బ్ చేసిందీ...'

'రాత్రి ఏం చెప్పేనమ్మా. ఈ రోజు త్వరగా నిద్ర లేవాలని చెప్పలేదూ?'

'కాని ఇప్పుడింకా ఎనిమిదిన్నర కూడా కాలేదు కదా డాడీ! తొమ్మిదింటికి లేస్తే

సరిపోతుందనుకొన్నాను.'

'కాదమ్మా. వెళ్లి కాలకృత్యాలు తీర్చుకొని నా గదిలోకి రా. నీతో అర్జంటుగా ఓ విషయం మాట్లాడాలి.'

'ఏ విషయం? పెళ్ళి విషయం. అంతేగా? నేను పెళ్ళి చేసుకోనని ఎన్నిసార్లు చెప్పాలి మీకు? ఐ హేట్ మేరేజ్. ఐ హేట్ మెన్.'

'అన్ని విషయాలూ మాట్లాడుకొందాం కదా? నువ్వు త్వరగా నీ పనులు ముగించుకొని రా.'

భుజాలు, తల ఎగరేసి సుకన్య బాత్‌రూమ్‌లోకి దూరింది.

'ఏమండీ. వంట త్వరగానే అయిపోతుందని వంట మనిషి చెప్పింది. బ్రాహ్మణులు త్వరగా వస్తామన్నారా? ఈ తద్దినం పని అయిపోతే పెళ్ళిచూపుల కార్యక్రమానికి ఏర్పాట్లు చేసుకోవచ్చు కదా? పెళ్ళి వాళ్లకు ఏమేం అయిటవ్స్ చెద్దామంటారు? అమెరికా సంబంధం మనం జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవద్దూ?'

'చూద్దాంలే. ముందు ఈ పితృకార్యం అయిపోనీ. అసలీ పెళ్ళి చూపులకి ముందు సుకన్యను ఒప్పించాలిగా?'

'అవసరమయితే భయపెట్టి, బెదిరించయినా దాన్ని ఒప్పించేయాలండీ మీరు. ఈ విషయంలో నేను దాన్ని వెనకేసుకొని రాను. దాని ధోరణి చూస్తుంటే నాకు భయంగా ఉంది.'

డిగ్రీ చదివే రోజుల్లో సుకన్య 'ప్రేమ ప్రేమ' అంటూ కలవరించేది. ప్రేమ కథలు చదివేది. ప్రేమ సినిమాలు చూచేది.

అప్పుడు విశ్వపతి ఏదో జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో పనిచేస్తుండేవాడు.

అక్కడినుంచి ట్రాన్స్‌ఫర్ అయ్యేనాటికి ప్రేమ ద్వేషంగా మారింది.

ప్రేమ కథల్ని, సినిమాల్ని తిట్టిపోయసాగింది.



ప్రేమించి పెళ్ళి చేసుకొన్నవారంటే మంట.

పెళ్ళి ప్రసక్తి ఎత్తితే చాలు తారాజువ్వలా లేస్తుంది.

కారణం అడిగితే చెప్పదు.

'దటీజ్ మై పర్సనల్ లైఫ్. డోంట్ ఆస్క్ క్వొశ్చన్స్ ఫాదర్.'

సుకన్యలో వచ్చిన మార్పుకు కారణం విఫల ప్రేమ అని విన్నాడు విశ్వపతి.

'డాడీ. బ్రేక్‌ఫాస్ట్ లేదంటున్నది మమ్మీ. వెరీ బేడ్ డాడీ.'

'ఇవాళ మనింట్లో తద్దినమమ్మా. మడి ఆచారం, నియమ నిష్టలు పాటించాలీ రోజు.'

'మడీ ఆచారం! నాన్‌సెన్స్ డాడీ.'

నేనుకూడా రోజూ వాటిని పాటించటం లేదుకదమ్మా. ఈ ఒక్కరోజూ — మా ఫాదర్ తృప్తికోసం తప్పదమ్మా. కలెక్టర్ ఉద్యోగం చేస్తూ కూడా మా ఫాదర్ సనాతన ఆచారాలని, సంప్రదాయాలని పాటించేవాడు. ఈ ఒక్కరోజుకు హోటల్‌లో టిఫిన్ చెయ్యమ్మా. ఒక్కరోజుకు మన పెద్దల కోసం మన అలవాట్లని, సుఖాలని, సిద్ధాంతాలని త్యాగం చేయటంలో తప్పులేదు కదమ్మా.'

ఆ తర్వాత అసలు విషయంలోకి వచ్చాడు విశ్వపతి.

'అమ్మా. పెళ్ళి విషయంలో నువ్వెందుకిలా ప్రవర్తిస్తున్నావో నాకు తెలియదు. ఆ కథలు చెప్పమని అడగను. కానీ నువ్వు పెళ్ళి చేసుకోకతప్పదమ్మా. ఎంత ఎదిగినా స్త్రీ పురుషులిద్దరికీ ప్రకృతి సిద్ధంగా లభించిన అవసరం పెళ్ళి. దాన్ని ద్వేషించి లాభం ఏమిటి? అంచేత నీకో సంబంధం దాదాపు సెటిల్ చేసేను. అతను అమెరికాలో సెటిల్ అయ్యాడు. నీ ఫోటో అతనికి, అతని పెద్దలక్కూడా నచ్చింది. ఈ సాయంకాలం వాళ్ళు నిన్ను చూసుకోటానికి వస్తున్నారు. అన్నీ కుదిరితే మరో వారంలో పెళ్ళి — ఆ వెంటనే అమెరికా ప్రయాణం. నువ్వు ఒప్పుకోక తప్పదమ్మా. ఆ అబ్బాయిని చూస్తే నువ్వు తప్పక ఒప్పుకుంటావు. కనీసం పెళ్ళిచూపులకన్నా ఒప్పుకోమ్మా.'

'కానీ డేడీ. ఈరోజు మీ ఫాదర్ తద్దినం కదా? పెళ్ళిచూపులు ఎలా కుదుర్తుంది?'

'అవుననుకో. కానీ వాళ్ళు ఈవేళే నిన్ను చూడాలని పట్టుపట్టారమ్మా.'

'దటీజ్ టెరనీ ఫాదర్. మీరు తద్దినం విషయంలో సెంటిమెంటల్ అని మాకు తెల్సు. కానీ ఆ సెంటిమెంట్‌ని కూడా వాళ్ళ విషయంలో వదిలేసేరు. ఎందుకు? నా కోసం... అవునా?'

'అవునమ్మా. నీకు అతను నచ్చుతాడని నా విశ్వాసం. ఈ ఛాన్సు వదులుకోటం నాకు ఇష్టం లేదమ్మా. ప్లీజ్. అంగీకరించమ్మా?'

'ఆల్‌రైట్ ఫాదర్. పెళ్ళి చూపులకి అంగీకరిస్తున్నాను' అంటూ ఆమె వాకిట్లోకి దూసుకొనిపోయింది.

** ** **

స్కూటర్‌ను పోర్టికోలో పార్క్ చేసి ఒక

చిన్న బ్రీఫ్‌కేసు తీసుకొని అతను లోపలికి రావటాన్ని బాల్కనీ పైనుంచి చూచాడు విశ్వపతి.

ఎవరతను? గోపీ ఫ్రెండా?

లేక పెళ్ళికొడుకా?

పొడుగ్గా, పచ్చటి రంగులో, నల్లటి జుట్టులో, కొనదేరిన అందమైన ముక్కుతో, ఖరీదైన దుస్తుల్లో అతను చాలా అందంగా, ఆకర్షణీయంగా ఉన్నాడు.

సుకన్యకు సరైన ఉజ్జీ! ఈ పెళ్ళి కుదిరితే ఎంత అదృష్టం?

ఆ వ్యక్తి తన అల్లుడని చెప్పుకోటం ఎంత గర్వం? ఎంత థ్రిల్!

'ఎవరండీ? ఎవరు కావాలి?' అప్పుడే వాకిట్లోకి వెళ్లటానికి వచ్చిన గోపీ అడిగేడు అతడిని.

'మిస్టర్ విశ్వపతిగారిల్లు ఇదేనా?'

'ఊ. కానీ నాన్నగారు ఈవేళ శలవులో ఉన్నారండీ. అఫీషియల్ వర్క్ ఏమీ చూడరు.'

'నా పేరు సోమయాజులు. సిద్ధాంతిగారు పంపించారని చెప్పండి. అయామ్ ది చీఫ్ పురోహిత్ ఆఫ్ ది సెరిమెనీ'

విప్వెరపోయాడు విశ్వపతి!

ఇంత చేస్తే ఇతను మంత్రం చెప్పే బ్రాహ్మడా?

ఆ వేషం, ఆ ఠీవి... బ్రాహ్మణ్యం ఎంత భ్రష్టమయింది!

'ఓ. తద్దినం బ్రాహ్మడా మీరు! ఫెంటాస్టిక్... డేడీ... డేడీ... ఎవరొచ్చారోచూడండి' అని కేకేసి వెళ్ళిపోయాడు గోపీ.

విశ్వపతి హాలులో కొచ్చేసరికి సోఫాలో కూర్చుని పేపరు చదువుతున్నాడు సోమయాజులు:

విశ్వపతికి మళ్లీ తనని పరిచయం చేసుకొన్నాడు.

'సిద్ధాంతిగారు మిమ్మల్ని భోక్తగా పంపించారా? మంత్రం చెప్పటానికి పంపేరా?'

'మంత్రం చెప్పటానికేనండీ. నేను భోక్తగా వెళ్లనని ఆయనకి తెల్సు. ఇదైనా ఆయన చెప్పిందంతా విన్నాక ఆయన మాట కాదనలేకనే ప్రోగ్రామ్‌ని అడ్‌జస్ట్ చేసుకొని రావాల్సివచ్చింది. మీకోసం.'

'మీరేమనుకోనంటే ఒకమాట అడుగుతాను. మీకు మంత్రం క్షుణ్ణంగా వచ్చా?'

'అంటే — సిద్ధాంతిగారి మీద మీకు నమ్మకం లేదా? ఆయన నాకంతా చెప్పేరులెండి. ముందు నా పంచె, ఉత్తరీయం కాస్త



## అదృష్టం

—"మీ ఇంట్లో వంట మీ ఆవిడే చేస్తుందటగా... అదృష్టంవంతుడివి" అన్నాడు గోవిందం.

"ఏం అదృష్టం నా బొంద... రోజూ అంట్లు తోమలేక, బట్టలుతకలేక ఛస్తుంటేనూ" భోరుమన్నాడు సుబ్బారావు.

—మహర్షి (కొత్తగూడెం)

మడికి ఆరవేయించే ఏర్పాటు చూడగలరా?' నవ్వుతూ అన్నాడతను.

'ఎందుకండీ. మా ఇంట్లో బ్రాహ్మణుల క్కూడా ఆ ఏర్పాటు చేసే అలవాటుంది.'

'సిద్ధాంతి గారు చెప్పేరు. కానీ నా డ్రస్ వేసుకోటమే నా అలవాటు.'

ఇద్దరు భోక్తలొచ్చాక స్నానాలయ్యాయి.

ఖరీదైన తెల్లటి పంచె కట్టుకొని, ఉత్తరీయం నిండుగా కప్పుకొని నుదుట విభూతి రేఖలు దిద్దుకొని మధ్యాహ్న సంధ్య వారుస్తున్న సోమయాజుల్ని చూడటానికి విశ్వపతికి రెండు కళ్ళూ చాలలేదు.

వేషం బాగుంది. అందగాడు కనుక ఏ వేషం వేసినా నప్పుతోంది.

కానీ తనక్కావాల్సింది వేషం కాదు. డొక్కశుద్ధి. మంత్రం చెప్పటం అగ్నికార్యం.

ఔపోసన కార్యక్రమం అయింది. శ్రద్ధాకర్మ ప్రారంభమైంది.

ఎప్పుడూ సిద్ధాంతిగారితోపాటుమంత్రం. తనూ చెప్పటం విశ్వపతికి అలవాటు. కానీ ఇప్పుడు అతనికి నోరు పెగల్లేదు.

సోమయాజులు మంత్ర పఠనాన్నిమంత్రముగ్ధుడులా వింటూ ఉండిపోయాడు. అదేం స్వరం, అదేం స్పష్టత. అదేం మాధుర్యం?

బ్రాహ్మణులు భోజనానికి కూర్చున్నారు.

సంకల్పం చెప్పించి 'అన్నసూక్త'మంత్రం పఠించసాగేడు.

ఆ మంత్ర మాధుర్యానికి ముగ్ధుడైన గోపీ అక్కడికొచ్చాడు. అలాగే నిలబడి విన్నాడు.

'స్ప్లెండిడ్ డేడీ. ఇటీజ్ మ్యూజికల్.'

'వేద మంత్రాలన్నీ విజ్ఞాన ఖనులు. స్వరమాధురులు, అసలు సామవేదం సంగీత ప్రధానం.

శ్రాద్ధ కర్మ అయిపోయింది. సోమయాజులు అప్పుడు చేతి గడియారం చూసుకొన్నాడు.

'విశ్వపతిగారూ. మరో గంటలో నాకు ఇంపార్టెంట్ ఎంగేజ్‌మెంట్ ఒకటి ఉంది. త్వరగా వడ్డన ఏర్పాట్లు చేయించండి.'

ఇష్ట బంతిలో కుటుంబ సభ్యులందరితో కల్సి భోజనం చేసే అలవాటుంది విశ్వపతికి.

కానీ పొద్దున పోయినా సుకన్య ఇంతవరకూ రాలేదు.

'మంత్రం చాలా బాగా చెప్పేవు నాయనా. నాకు చాలా తృప్తి కలిగింది. ఎంత భయపడ్డానో అంత బాగా జరిగిపోయింది శ్రాద్ధకర్మ. సిద్ధాంతిగారికన్నా చాలా స్వరయుక్తంగా స్ఫుటంగా చెప్పేవు మంత్రం. ఎక్కడ నేర్చుకున్నావు?' భోజన సమయంలో అన్నాడు విశ్వపతి.

'మా నాన్నగారు, ఘనాపాటీ అండీ. చాలా చిన్నతనంలోనే ఉపనయనం చేసి నాకు స్మార్తం చెప్పేరు. ఆ రోజుల్లో తద్దిన మంత్రం నోట్లో ఉంటే బ్రాహ్మణుడికి మూడుగొర్ల పొలం ఉన్నట్లు అంటుండేవారు. మన పెద్దలది ఎంత దీర్ఘదృష్టి అనిపిస్తుంటుంది నాకిప్పుడు.'

'ఎలాగంటారు?'

'నా యమ్మే డిగ్రీ నాకు ఉపాధి చూపలేకపోయింది. యస్సెస్సీ నుంచి యమ్మే వరకు నా కొచ్చిన గోల్డు మెడల్స్ నాకు గౌరవాన్నివ్వలేకపోయాయి. కానీ మా నాన్న గారు చిన్నతనంలో నేర్పిన ఈ విద్య నాకు ఆస్తిని, అంతస్తును, గౌరవాన్ని సమకూర్చిపెట్టిందండీ.'

'అంటే నువ్వు యమ్మే గోల్డు మెడలిస్టువా?'

'ఇటీవలే థీసిస్ కూడా సబ్‌మిట్ చేసేనండీ. నా థీసిస్‌కు కూడా గోల్డ్ మెడల్ వస్తుంది. డిగ్రీలకే కాదండీ. కాలేజీలో ఇంకా అనేక రంగాల్లో నాకు చాలా గోల్డ్ మెడల్స్ వచ్చాయి.

'ఉద్యోగం ఇప్పిస్తే చేస్తావా?'

'రెండేళ్ల క్రితమయితే చేస్తాననే వాడినేనండీ. కానీ ఇప్పుడు ఒకరి వద్ద బానిస ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు. నా వృత్తి నాకు ధనంతోపాటు గౌరవాన్ని, తృప్తిని కూడా ఇస్తున్నది.'

'నెలకేమాత్రం సంపాదిస్తారు మీరు?'

'ఒక సీనియర్ అయ్యేయస్ అధికారి జీతంకన్నా తక్కువగా ఉండదండీ. కాగా ఇప్పుడు నేను చాలామందికి ఉపాధి చూపగల స్థాయిలో ఉన్నాను. ఈ వృత్తిలో నా సర్వీసు సరిగ్గా సంవత్సరం మాత్రమే.'

'ఓ! అయ్‌సీ! మీరు స్కూటర్ మీద ఈ ఇంటిముందు దిగినప్పుడు మిమ్మల్ని నిజంగా ఏ ఆఫీసరనో అనుకొన్నానండీ.'

నవ్వేడతను.

'పిలకతో నీరుకావి కొల్లాయిగుడ్డతో బ్రాహ్మణులుండాలని కొందరి ఉద్దేశ్యమండీ. మనిషికి విలువ నిచ్చేది వేషభూషణాలు కాదు. పాండిత్యం. ఆ విషయం నాకు తెల్సు. కానీ కాలం మారులోంది. కాలానుగుణంగా వేషభూషణాలని మనం కూడా మార్చకపోతే ఎంత పాండిత్యమున్నా రాణించదండీ. కార్పెన్‌టర్స్, బార్బర్స్, వాషర్ మెన్, బ్లాక్‌స్మిత్స్ ఇలా అన్ని వృత్తుల వారూ వేషాలని మార్చగా లేంది వైదిక వృత్తిలో ఉన్న వారు మాత్రం ఎందుకు మారకూడదండీ?

ఎస్. నా వృత్తి, మూలధర్మాన్ని నేను భ్రష్టం చేయను. కానీ దాన్ని కమర్షియలైజ్ చేయటానికి కావాల్సిన అన్ని హంగుల్ని




## దత్తత శాసనం

పిల్లలులేనివారు ఎవరి పిల్లలనయినా దత్తత తీసికొంటారు! అయితే అలా దత్తత తీసికొనే విషయంలో కూడా 'హిందూయాక్ట్' ను ఫాలో కావాలి! ఈ శాసనం ప్రకారం ఎవరైనా ఒక అబ్బాయినీ, అమ్మాయినీ దత్తత తీసికోవచ్చు. ఈమధ్య బొంబాయికి చెందిన దంపతులు ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయిని దత్తత తీసికొందామనుకొన్నారట! అందుకు న్యాయస్థానం అభ్యంతరం పెట్టిందట! కావాలంటే ఒక అబ్బాయి, అమ్మాయిలను దత్తత తీసికొని రెండో అబ్బాయికి గార్డియన్‌గా ఉండమన్నారట! అంటే కొన్ని విషయాలలో మనకు ఇష్టం వచ్చిన పనిని కూడా చేయకూడదన్నమాట! దటీజ్ లా!!

—జూపిటర్

ఏర్పరుస్తాను. డాక్టర్స్‌లాగా కొన్ని రోజుల తర్వాత నేను 'వేదిక్ క్లినిక్స్'ను ఓపెన్ చేయాలనుకుంటున్నాను. విజిటింగ్ ఫీజ్, ఇంటర్వ్యూ టైమ్ ఎక్స్‌ట్రా అన్నీ వుంటాయి అక్కడ...

'కానీ ముందు ముందు అసలు బ్రాహ్మణ వృత్తికి విలువుండదేమో!'

'పొరపాటండీ. మనిషి శరీరారోగ్యానికి మెడికల్ క్లినిక్స్, మానసిక ఆరోగ్యానికి మెంటల్ క్లినిక్స్ పెరిగినట్టే ఆత్మతృప్తికి ఆధ్యాత్మిక క్లినిక్‌లవసరం పెరుగుతుందే కాని తరగదు. శరీరం, బుద్ధి, ఆత్మ ఈ మూడూ మనిషిలో అంతర్భాగాలు కదండీ?

అతని ఆత్మ విశ్వాసం విశ్వపతిని ఆకర్షించింది.

తాంబూలం తీసుకొని డ్రస్ చేసుకొన్నాడతను.

'దిస్ ఈజ్ మై విజిటింగ్ కార్డ్ అండ్ దిస్ ఈజ్ ది టారిఫ్ లిస్ట్. అవసరమయితే రింగ్ చేయండి.'

'అన్నట్టు బాబూ. మీకు వివాహమయిందా? పిల్లలెంతమంది?' విశ్వపతి భార్య ప్రశ్నించింది.

'లేదండీ. నాకింకా పెళ్ళికాలేదు. చేసుకుంటానన్న నమ్మకం కూడా లేదు.'

'ఏం? ఎంచేత?'

'ఎంచేతంటే — పెళ్ళి చేసుకోటం నాకిష్టం లేదు కనుక. ఎందుకిష్టం లేదని మాత్రం అడక్కండి. ప్లీజ్...!'

అతను గుమ్మం దాటబోతూ ఠక్కున ఆగిపోయాడు.

గుమ్మానికి కవతల... అవతల...

** ** **

అమెరికాలో ఉంటున్నాడని పేరే కానీ—

అతను నల్లగా సన్నగా గడకర్రలా ఉన్నాడు. గుంట కళ్లు. పీలగొంతు...

అతడిని చూడగానే సోమయాజులు గుర్తుకొచ్చాడు విశ్వపతికి.

'అమెరికాలో ఉండాల్సిన వాడు అతను. బ్రాహ్మణార్థాలు చెయ్యవల్సినవాడు ఇతను' అనుకొన్నాడు.

'ఏమండీ. అబ్బాయి నాకు నచ్చలేదు. సుకన్యకు తగినవాడు కావేకాదు. అయినా అది అంగీకరిస్తే మనం కాదనవద్దు. ఏదో విధంగా అది పెళ్ళి చేసుకొంటే నాకదే చాలు' భార్య రహస్యంగా అంది విశ్వపతితో.

అతనికి సుకన్య నచ్చింది. అందరికీ నచ్చింది.

'ఎంత త్వరగా ముహూర్తం చూచి ఆ మూడు ముళ్ళూ వేయిస్తే వాళ్లకి అంత మంచిది బావగారూ. ఎందుకంటే మళ్ళీ అమెరికా ప్రయాణం వుంది కదా? మావాడు ఆ ఏర్పాట్లు చూచుకోవాలి. భార్యకు వీసాలు అవీ సంపాదించాలి. చాలా తతంగం ఉంటుందనుకొంటూ. ఏరా?'

'అవును. నేను నా పార్ట్‌నర్‌ని తీసుకుపోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకొనే వచ్చాను. పెళ్ళి ఎంత త్వరగా అయితే నాకు అంత మంచిది.'

అప్పుడు అందరి దృష్టి సుకన్య మీద పడింది.

అంతవరకు ఒక్కమాటన్నా మాట్లాడకుండా తలవంచుకొని కూర్చున్న ఆమె ఏదో నిర్ణయానికొచ్చినట్లు మెల్లగా లేచింది.

'నా అభిప్రాయం చెప్పటానికి ఒక్క గంట గడువివ్వండి. ఆ తర్వాత నీ ఇష్టం' అంటూ వెళ్ళి ఆమె పోర్టికోలో ఉన్న కారు ఎక్కి స్టార్ట్ చేసుకొని వెళ్ళిపోయింది. అంత హఠాత్తుగా ఎక్కడికి వెళ్ళినట్లు? గంటలో ఏంచేస్తుంది? ఏం నిర్ణయిస్తుంది?

టిక్... టిక్... టిక్...

సెకన్లు నిముషాలుగా మారి ప్రయాణం చేస్తున్నాయి.

అరగంట — గంట కావస్తోంది.

అయినా సుకన్య జాడ లేదు.

అప్పుడు సుకన్య పెళ్ళి తమకెలా సమస్య అయిందీ చెప్పేడు విశ్వపతి.

'ఇష్టం లేని పెళ్ళి బలవంతంగా చేస్తామని భయపడి కొంపతీసి ఆత్మహత్య చేసుకోదు కదా? పాపిష్టిదాన్ని, పెళ్ళి పెళ్ళి అని ఒకటే పోరేను.'

'మీ అమ్మాయినే చేసుకోవాలని మాడికేం లేదండీ. ఇప్పటికే మాకు మూడు సంబంధాలు వచ్చి రిజర్వులో ఉన్నాయి. వాటిలో ఏదో ఒకటి సెలక్ట్ చేసుకుంటాం. మీ అమ్మాయిని మాకోసం కష్టపెట్టవద్దు' అబ్బాయి తండ్రి అన్నాడు.


'అయినా ఆమెకు మాట ఇచ్చాంగా! తిరిగి వచ్చిందాకా ఆగుదాం డాడీ. ఐ లైక్ సుకన్య. షి ఈజ్ ఎ గాల్ స్యూటబుల్ టు లివ్ ఇన్ అమెరికా'.

గంటన్నరయినా సుకన్య తిరిగి రాకపోవడంతో టెన్షన్ పెరిగింది.

విశ్వపతికి భయం పట్టుకుంది.

'పోలీసులకి ఫోను చేయండి. నలుగురం నాలుగు వైపులకు పోయి వెతుకుదాం పదండి'

విశ్వపతి భార్య ఏడుపు మొదలుపెట్టింది.



పోలీసులకి రింగ్ చేస్తున్నాడు విశ్వపతి.

అప్పుడు పోర్టికోలో కారు ఆగింది.

'సుకన్య, సుకన్య వచ్చింది' గోపీ అరిచాడు ఉత్సాహంగా.

'కానీ...' అంటూ నీరసంగా ఆగేడు అతను.

కానీ ఏమయిందీ.

అంతే అటు చూచాడు.

సుకన్య వెంట సోమయాజులు కారు దిగేడు.

'సారీ సార్స్. కొంచెం లేటయింది. మిమ్మల్ని వెయిట్ చేయించినందుకు క్షమించండి. మమ్మీ డేడీ. మీ కోరిక నెరవేరుస్తాను అంటూ సుకన్య సోమయాజులు వైపు చూచి నాలిక్కరుచుకుంది.

'సారీ అండీ. మమ్మీ డాడీ కల్చర్ వద్దన్నారు కదూ? అమ్మా నాన్నా. మేమిద్దరం పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం. మమ్మల్ని ఆశీర్వదించండి.'

'ఏమిటి? ఆఖరికి ఈ బ్రాహ్మణార్థం బ్రాహ్మడా నాకు బావగారు! మన ఇంటి పరువుతీసేవు సిస్టర్!' గోపీ ఆవేశంగా అన్నాడు.

'షటప్. ఆయన్ని గురించి నీకేం తెల్సురా? హి ఈజ్ ఎ గ్రేట్ మేన్'

'అంటే — నీకితను ముందే తెల్సా అమ్మా?'

'తెల్సు నాన్నగారూ. డిగ్రీ చదివేటప్పుడు తెల్సు. అతను గొప్ప నటుడు. గాయకుడు. కవి. వక్త. హోరేషియస్ రీడర్. ఒక్కసారి వింటే గ్రహించి గుర్తించగల సమర్థుడు. ఆరోజుల్లో అతను మా కాలేజీ హీరో. అమ్మాయిలందరం అతని వెంట పడేవాళ్లం. అతడి చేత ప్రేమింపబడటానికి పోటీపడేవాళ్లం. నేను అతడిని ప్రేమించాను పెళ్ళి చేసుకొంటానని స్నేహితురాళ్లతో పందెం వేసేను. అతడినొకరోజు ధైర్యం చేసి అడిగేను. ధర్మపన్నాలు చెప్పి నన్ను మందలించాడు. నాకు పురుషులన్నా పెళ్లన్నా అసహ్యం ఏర్పడింది. కానీ మనసులో అతడికి తప్ప మరెవర్నీ చేసుకోకూడదని ఆనాడే నిర్ణయించుకొన్నాను. ఇన్నాళ్లకు మళ్లీ ఈ రోజు అతను కన్పించాడు.'

'కానీ ఇప్పుడతనేం చేస్తున్నాడో...

'అంతా తెల్సునమ్మా. నాన్నతో అతని సంభాషణలంతా విన్నాను. ఐలైక్ ఇట్. వైదిక ధర్మాన్ని గౌరవించే మీరు ఆ వృత్తిలో ఉన్నవారికి చిన్న చూపు చూస్తే ఎలా నాన్నా? అతను గొప్ప ప్రతిభావంతుడు. అతనే రంగంలో ఉన్నా రాణిస్తాడమ్మా. అసలతను ఎన్ని కండిషన్లు పెట్టి నన్ను పెళ్ళి చేసుకోటానికి అంగీకరించాడో మీకు తెల్సా?

'కండిషన్లా.'

'నిజం చెప్పాలంటే డిగ్రీ చదివే రోజుల్లోనే నేను కూడా మీ అమ్మాయిని ప్రేమించానండీ. కానీ ఆమె జీవన ధోరణి, విధానం, నా ప్రవృత్తికి, ఆదర్శానికి భిన్నమైనవి. అంచేత ఆ రోజు నిరాకరించాను. అయితే మరెవర్నీ పెళ్ళి చేసుకోకూడదని నిర్ణయించుకొన్నాను. ఈరోజు మేమిద్దరం మళ్లీ కాకతాళీయంగా కల్సేము. సుకన్య నా దగ్గరికొచ్చి పెళ్ళి చేసుకోమన్నప్పుడు ఇదం

తా చెప్పేను. వేషభూషణలు ఎలా ఉన్నా ఫర్వాలేదు. కానీ భార్య నాలాగా నా దేశ సంస్కృతి మూలతత్వాన్ని గౌరవించి అనుసరించాలని కోరుకోటంలో తప్పులేదు కదా? నా వృత్తి రీత్యా కూడా అది అవసరం. నన్ను ప్రేమించి నా వృత్తిని ద్వేషించే భార్యతో నేనెలా కాపురం చేయగలను? అందుకని కొన్ని కండిషన్స్ పెట్టక తప్పలేదు.'

'వాటన్నింటినీ మనసావాచా కర్మణా నేను అంగీకరించాను. ఇక మీరు మా వివాహాన్ని ఆమోదించి అక్షింతలు వేస్తే...

'ఎక్స్‌క్యూజ్ మీ సర్. మీ వృత్తి పురోహితమా? మీరు వేద పండితులా?' అమెరికా పెళ్ళికొడుకు కలుగజేసుకొని సోమయాజుని అడిగాడు.

ఎస్. అతని వృత్తి పురం యొక్క హితాన్ని కోరటం, లోకశ్రేయస్సును వాంఛించటం...'

'మీరు డిగ్రీ హోల్డరా?'

'యమ్మే గోల్డ్ మెడలిస్ట్. త్వరలో డాక్టర్ సోమయాజులు కాబోతున్నాడు' సుకన్యే గర్వంగా చెప్పింది.

'ఓ! దట్ ఈజ్ మార్వెలెస్. మీలాంటి వారి అవసరం అమెరికాకు చాలా ఉందండీ. ముఖ్యంగా అక్కడ సెటిల్ అయిన భారతీయులకి! మీకు అభ్యంతరం లేకపోతే మీ దంపతుల్ని అమెరికాకు నేను ఆహ్వానించి తీసుకుపోతాను.'

'థాంక్యూ సర్. కానీ నా లాంటివాళ్ల అవసరం భారతదేశంలో కూడా ఉందని నా నమ్మకమండీ. వైదిక ధర్మంలో భ్రష్టాచారాలెన్నో చోటుచేసుకున్నాయి. వాటిని తొలగించి మూలతత్వంతో పునరుజ్జీవింపచేయటం అవసరం. అలాగే ఆధునీకరణం చేయటం కూడా అవసరం. దటీజ్ మై మిషన్. మై లైఫ్ యాంబిషన్.'

'కానీ అమెరికాలో అవుతే డబ్బు చాలా త్వరగా సంపాదించవచ్చు. ఆలోచించండి.'

అతను ఒక్క క్షణం ఆలోచించాడు.

'యు ఆర్ రైట్ సర్. నా యాంబిషన్ తీరాలంటే డబ్బు అవసరం. అంచేత మీ ప్రపోజల్‌ను ఏక్సెప్ట్ చేస్తున్నాను. ఇక్కడ వేదిక క్లినిక్స్ ఏర్పాటుచేసి ప్రజల ఆధ్యాత్మిక అవసరాలను తీరుస్తాను.'

'సో. పెళ్లి చేసుకొని మీ ఇద్దరూ త్వరలో అమెరికా వస్తున్నారు.'

'యస్ సర్ — విత్ యువర్ కైండ్ కర్టసీ' అంటూ సుకన్య చేతిని తన చేతిలోకి తీసుకొని వంగి విశ్వపతి దంపతులకు నమస్కరించాడు సోమయాజులు. ✱



### పట్టేశాం

"మీటింగ్‌లో మీరు మాట్లాడుతుంటే రాయి విసిరిన వాడిని పట్టేశాం సార్" చెప్పాడు యస్సయ్.

"ఎలా పట్టుకున్నారోయ్" అడిగాడు మంత్రిగారు.

"మీటింగ్‌కి వచ్చింది వాడొక్కడే సార్" చెప్పాడు యస్సయ్.

జంగం రామ్మోహన్ (వరంగల్)